క్లుప్తంగా

స్వచ్ఛ వరంగల్ కరపత్రాల ఆవిష్కరణ



కాజీపేట: కాజీపేట 61వ డివిజన్ ప్రశాంత్‌నగర్ కాలనీ ప్రభుత్వ కమ్యూనిటీ హాల్ ఆవరణలో స్వచ్ఛ వరంగల్ అవగాహన సదస్సును కార్పొరేటర్ ఎలకంటి రాములు ఆదివారం ప్రారంభించారు. స్వచ్ఛ వరంగల్ పౌర సంఘాల వేదిక ఆధ్వర్యంలో ప్రత్యేక సదస్సు ఏర్పాటు చేసి పలు తీర్మానాలను ఆమోదించారు. స్వచ్ఛ వరంగల్ పౌర సంఘాల వేదిక సభ్యుడు వల్లంపట్ల నాగేశ్వర్, అనురాగ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ అనితారెడ్డి.. కాలనీ అభివృద్ధి కమిటీ సభ్యులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బైరి రవికృష్ణ గౌడ్, ఆర్.రాజ్‌మోహన్ రావు, కోండ్ర నర్సింహరావు, ఠాకూర్ రతన్‌సింగ్, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాజరాజేశ్వరీదేవి ఆలయంలో శాకంబరి ఉత్సవాలు



హన్మకొండ కల్చరల్: వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరీదేవి ఆలయంలో ఆషాఢ శుద్ధపాడ్యమి సోమవారం నుంచి శాకంబరి నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. అందులో భాగంగా ఆదివారం అమావాస్య తిథిని అనుసరించి అమ్మవారి ఉపాసకులు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో మేడి వృక్షానికి పూజలు, రాజరాజేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. సోమవారం నుంచి జూలై 3వ తేదీ వరకు జరగనున్న ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజు అర్చనలు జరుగుతాయని లక్ష్మణశర్మ తెలిపారు.

అనాథ పిల్లలకు అన్నదానం



భోజనం వడ్డిస్తున్న ప్రీతి, తదితరులు

విద్యారణ్యపురి: మల్యాల వంశీకృష్ణ జన్మదినాన్ని పురస్కరించుకొని న్యూశాయంపేట ప్రాంతంలోని హోప్ చిల్డ్రన్స్ హోమ్‌లో అనాథ పిల్లలకు ఆత్మకూరు ప్రీతి ఆదివారం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మాజీ అధ్యక్షుడు ఆత్మకూరు దేవేంద్రచారి, మల్లాల దేవేందర్, విజయ, కార్తీక్, అఖిల, హోమ్ డైరెక్టర్ మార్టిన్ లూథర్, ఇన్‌చార్జ్ ప్రసన్నకుమారి, సిబ్బంది సంతోష్, మౌనిక, శాలిని, అనూష తదితరులు పాల్గొన్నారు.

లార్డ్ స్వచ్ఛంద సంస్థకు ఉత్తమ సేవా పురస్కారం

హసన్‌పర్తి: ఉత్తమ సేవా పురస్కారానికి భీమారంలోని లార్డ్ స్వచ్ఛంద సంస్థ ఎంపికైంది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పట్టణ ప్రగతి దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల నగరంలోని జరిగిన కార్యక్రమంలో లార్డ్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు నారగోని నరేష్‌కు ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్, మేయర్ గుండు సుధారాణి, బల్దియా కమిషనర్ షేక్ రిజ్వాన్‌బాషా అవార్డు అందించి అభినందించారు.

ఇరువురికి సన్మానం



కాజీపేట అర్బన్: 83 సార్లు రక్తదానం చేసి గవర్నర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కాలనీవాసి జనార్దన్‌రెడ్డి, ఉత్తమ ఉద్యోగిగా అవార్డు అందుకున్న ప్రభాకర్‌ను హనుమకొండ ఇందిరానగర్‌వాసులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రావుల లక్ష్మారెడ్డి, కాలనీవాసులు టీఎన్జీఓ, టీజీఓ మాజీ కార్యదర్శి కాసుల రత్నవీరాచారి, ధనరాజ్, కిశోర్, శ్రీనివాస్, బాలు నాయక్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మగుడి నిర్మాణానికి విరాళం



కరీమాబాద్: నగరంలోని 40 డివిజన్ నానామియతోటలో పోచమ్మ గుడి నిర్మాణానికి గద్దం యుగంధర్ గౌడ్ రూ.11వేలు విరాళంగా అందజేశారు. ఈమేరకు పోచమ్మ అభివృద్ధి కమిటీ సభ్యులకు ఆదివారం అందించారు. కార్యక్రమంలో వాసూరి శ్రీనివాస్, శ్రీపతికుమార్, విజయ, మల్లయ్యగౌడ్, రణం శ్రీనివాస్, సుధాకర్, భరత్, స్వామి, రాజు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ధ్రువీకరణ పత్రాలకు పడిగాపులు

- సర్వర్ డౌన్.. సర్టిఫికెట్ల జారీకి బ్రేక్
- మీ సేవ వెబ్‌సైట్ బిజీబిజీ
- పెరిగిపోతున్న దరఖాస్తులు... ముంచుకొస్తున్న గడువు
- తహసీల్దార్ లేక వరంగల్‌లో ఇక్కట్లు



వరంగల్ తహసీల్దార్ కార్యాలయం



తహసీల్దార్ కార్యాలయంలో పనిచేయని వెబ్‌సైట్



సర్వర్‌డౌన్‌తో సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ ఆలస్యం అవుతోందని ఏర్పాటు చేసిన పోస్టర్

వరంగల్: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా బీసీ రుణాలు ఇచ్చేందుకు అర్హులైన లబ్ధిదారులు 'మీ సేవ' సెంటర్లలో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. అందుకు సంబంధించిన తాజా కుల ధ్రువీకరణ, ఆదాయ ధ్రువీకరణ పత్రాలను అప్‌లోడ్ చేయాలనే నిబంధనలు పెట్టడంతో లబ్ధిదారులు మీ సేవ సెంటర్ల ముందు బారులుదీరుతున్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం లబ్ధిదారులు మీ సేవ సెంటర్లలో దరఖాస్తులు చేయడంతో మీసేవ సర్వర్ డౌన్ కావడంతో తహసీల్దార్ కార్యాలయంలోని మీసేవ వెబ్‌సైట్‌లు కూడా పనిచేయడం లేదు. ఈనెల 9నుంచి వందల సంఖ్యలో దరఖాస్తులు రావడం, వెబ్‌సైట్ బిజీ కావడంతో వరంగల్, ఖిలా వరంగల్ తహసీల్ కార్యాలయాల్లో సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పెండింగ్‌లో పడింది. వరంగల్ కార్యాలయంలో శనివారం నాటికి సుమారు 8వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంతో అధికారులతో లబ్ధిదారులు ఘర్షణకు దిగుతున్నారు. మీసేవ నిర్వాహకులు సంబంధిత విభాగం నుంచి డైరెక్టుగా లింక్‌లను కొనసాగిస్తుండడంతో వారి సెంటర్లు నిరాటంకంగా నిర్వహిస్తున్నట్లు తెలుస్తోంది.

తహసీల్దార్ లేక ఇక్కట్లు

అసలే సర్వర్ డౌన్‌తో ఇబ్బందులు పడుతున్న వరంగల్ తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి రెగ్యులర్ తహసీల్దార్ లేకపోవడం ఇంకో సమస్య వచ్చి పడింది. పదోన్నతిపై వరంగల్ తహసీల్దార్ బదిలీ కాగా, ఆయన స్థానంలో ఖిలా వరంగల్ ఫణికుమార్‌కు పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. సర్టిఫికెట్లు అప్రూవల్ చేసేందుకు ఆయన లాగిన్ కావాల్సి ఉంటుంది. ఆయన ఖిలా వరంగల్‌లో ఉంటూ ఇక్కడ లాగిన్ కావడం కుదరదు. ఆయన వచ్చిన సమయంలో సర్వర్ డౌన్‌కావడంతో వరంగల్‌లో రోజుకు 10 – 20 ఆదాయ సర్టిఫికెట్లు మాత్రమే అప్రూవ్ చేస్తున్నారు. రాత్రివేళల్లో ప్రైవేటు మీ సేవ సెంటర్లను హోల్డ్‌లో పెట్టి రెవెన్యూ కార్యాలయానికి నేరుగా లింక్‌లను ఇస్తారని కలెక్టర్లు చెప్పినప్పటికీ లోపాయికారిగా మీసేవ సెంటర్ల నిర్వాహకులు సంబంధిత విభాగ అధికారులతో ఒప్పందం పెట్టుకోవడంతో వారి సెంటర్లు నిర్విరామంగా 24గంటలపాటు సాగుతున్నాయి. ఈనెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులకు చివరి గడువు కావడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వరంగల్‌కు రెగ్యులర్ తహసీల్దార్‌ను నియమించి ధ్రువీకరణ పత్రాలు సకాలంలో జారీ అయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

మసీదు దర్గా అభివృద్ధికి కృషి



దర్గాను దర్శించుకుంటున్న ఉర్సు పీఠాధిపతులు

ఖిలా వరంగల్: హజ్రత్ సయ్యద్ షా రహిమతుల్లా హలే రౌషన్ షహీద్ మసీదు దర్గా అభివృద్ధికి మరింతగా కృషి చేస్తామని ఉర్సు కరీమాబాద్ దర్గా పీఠాధిపతులు ఉబేద్‌బాబా, షోహబ్ బాబా, రాష్ట్ర కమిటీ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, కేర్ టేకర్ ఈద్గా ఖిలా వరంగల్ జానుల్లా షహీద్, దర్గా ప్రతినిధి ఎంఏకే తన్వీర్ అన్నారు. వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఖిలా వరంగల్ పెట్రోల్ బంక్ జంక్షన్ సమీపంలోని గంజ్ షోమద్ రహిమతుల్లా హాలే రౌషన్ షహీద్ మసీదు దర్గాలో ఆ మసీదు దర్గా అధ్యక్షుడు సయ్యద్ షా అరీపొద్దీన్ హుస్సైనీ సాబెరి ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ముఖ్యఅతిథులుగా వారు హాజరై ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య కేటాయించిన రూ.13లక్షల నిధుల వ్యయంతో నిర్మించే ప్రహరీ పనులను ప్రారంభించి మాట్లాడారు. ముస్లింల సంక్షేమానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎండీ.షబ్బీర్, ఎంఏ.రహీం, నసీర్ బేగ్, ఎండీ.నూరొద్దీన్, సయ్యద్ ముబాహిదా ఖాద్రీ, ఖాదీర్‌పాషా, నవాజ్, రఫీక్ హైమద్, ఎండీ.మన్సూర్ అలీ, అఖిల్, రాజేందర్, ముఖీద్‌ఖాన్, దస్తగిరి పాల్గొన్నారు.

'బీఆర్‌ఎస్ పాలన అస్తవ్యస్తం'



బాలుడి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుంటున్న నాయిని

ఎంజీఎం: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పాలన అస్తవ్యస్తంగా మారిందని, దోచుకుతినడం తప్ప ప్రజల బాగోగులు పట్టించుకునే పరిస్థితిలో పాలకులు లేరని కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. మడికొండ రాజీవ్‌గృహకల్పలో నివాసముంటున్న బాలుడిపై వీధి కుక్కలు దాడిచేయగా ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈక్రమంలో ఎంజీఎం ఆస్పత్రిలో చిన్నారి ఆరోగ్య పరిస్థితులను నాయిని రాజేందర్ రెడ్డి ఆదివారం అడిగి తెలుసుకుని బాలుడి తల్లిదండ్రులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కాజీపేటలో బాలుడిపై కుక్కలు దాడి చేసి చంపేస్తే అధికారులు, ప్రజాప్రతినిధులు అప్పుడు నానా హడావుడి చేసి ఆర్థిక సహాయం చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. ఘటన జరిగినప్పుడు మాత్రమే హడావుడి చేస్తూ ఆ తర్వాత మరిచిపోవడం షరా మాములుగా మారిందని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షుడు పల్లకొండ సతీష్, బంక సంపత్, మహ్మద్ సమద్, బొంత సారంగం, గన్నారపు సంగీత్, కొండ నాగరాజు, ఓరుగంటి పూర్ణ, శివ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే నరేందర్ క్షమాపణ చెప్పాలి

కాశిబుగ్గ: ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సెల్‌ఫోన్ లాక్కొని నిర్బంధించిన వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ బహిరంగ క్షమాపణలు చెప్పాలని వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి అమర్, కార్యవర్గ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ ఓసిటీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రెస్‌మీట్ అనంతరం ఎమ్మెల్యే నరేందర్‌ను ఓ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు ప్రత్యేక ఇంటర్వ్యూ చేస్తున్న సమయంలో జర్నలిస్టు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా వీడియో తీస్తున్న మొబైల్‌ను ఎమ్మెల్యే ఆగ్రహంతో లాక్కొని అందులోని వీడియోలను తీసివేసి, గంట పాటు గదిలో నిర్బంధించి బెదిరింపులకు పాల్పడ్డారని పేర్కొన్నారు. న్యూస్ కవరేజీలో భాగంగా ఎమ్మెల్యే నరేందర్‌ను ఇంటర్వ్యూ చేస్తుండగా అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఆగ్రహంతో తనపై ఊగిపోయారని జర్నలిస్టు గుంటి విద్యాసాగర్ ఆందోళన వ్యక్తం చేశారు.

నయీంనగర్: ఓ టీవీ జర్నలిస్టు సెల్‌ఫోన్ గుంజుకొని ధ్వంసం చేసి, దాదాపు గంటసేపు నిర్బంధించి బెదిరింపులకు పాల్పడిన వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ వెంటనే జర్నలిస్టులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జాతీయ కౌన్సిల్ సభ్యుడు దాసరి కృష్ణారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి మధు, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, కోశాధికారి బచ్చు పురుషోత్తం, తదితరులు డిమాండ్ చేశారు.

'టాస్'తో అధ్యక్షుడి ఎన్నిక

పద్మశాలి సేవా సంఘం నూతన కార్యవర్గం



రాకేష్, అధ్యక్షుడు



వెంకటేశ్వర్లు, కార్యదర్శి

హసన్‌పర్తి: పద్మశాలి సేవా సంఘం హసన్‌పర్తి శాఖ ఎన్నిక ఫలితాల ఉత్కంఠకు తెరపడింది. చివరికి టాస్ ద్వారా అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. పక్షం రోజుల క్రితం పద్మశాలి సేవా సంఘం ఎన్నికలు జరిగాయి. అధ్యక్షులుగా పోటీ చేసిన గూడురు లక్ష్మీనారాయణ, కేదాసి రాకేష్‌కు సమానంగా (223 ఓట్లు) ఓట్లు పోలయ్యాయి. ఈక్రమంలో ఇరువురు కూడా టాస్‌తో అధ్యక్షుడి ఎన్నికకు నిరాకరించారు. స్థానిక పద్మశాలి సేవా సంఘం భవనంలో కుల పెద్దలు ఆదివారం సమావేశమయ్యారు. చివరికి టాస్‌తో ఎన్నుకోవాలని తీర్మానించారు. ఈమేరకు టాస్ వేయగా, రాకేష్ గెలుపొందినట్లు ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా తలకొక్కుల సుభాష్, ప్రధాన కార్యదర్శిగా గడ్డం వెంకటేశ్వర్లు, కోశాధికారిగా మాటేటి దీప్‌రాజ్, కమిటీ సభ్యులుగా చెన్నూరి కుమారస్వామి, మాటేటి కుమారస్వామి, చెన్నూరి రవీందర్, మోత్కూరి శివకుమార్, దాసరి శ్రీనివాస్, కనుకుంట్ల రాజు, పొరండ్ల సారంగపాణి ఎన్నికైనట్లు ఎన్నికల ఇన్‌చార్జ్ మాటేటి భాస్కర్ ప్రకటించారు. కులపెద్దలు విద్యాసాగర్, భిక్షపతి, సంతోష్, నల్లా సత్యనారాయణ, చెన్నూరి కిరణ్, మాటేటి రవీందర్, కనుకుంట్ల సతీష్ తదితరులు పాల్గొన్నారు.

'టాడీ' రాష్ట్ర చైర్మన్‌కు స్వాగతం



రవికుమార్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

కాజీపేట: టాడీ రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ గౌడ్‌కు కల్లుగీత కార్మిక సంఘం జిల్లా నాయకులు కాజీపేట చౌరస్తాలో ఆదివారం సాయంత్రం స్వాగతం పలికి సన్మానించారు. గోపా జిల్లా కార్యాలయంలో ప్రతిభా పురస్కారాల పంపిణీకి జిల్లా పర్యటనకు వచ్చిన రవికుమార్‌ను సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ట్రస్ట్ రాష్ట్ర చైర్మన్ తాళ్లపల్లి రామస్వామి గౌడ్ అభినందించారు. కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ.రమణ, జిల్లా అధ్యక్షుడు గౌని సాంబయ్య, మెరుగు వీరస్వామి, భిక్షపతి, బుర్ర శ్రీనివాస్, చిర్ర నర్సింగ్ గౌడ్, తాళ్లపెల్లి శ్యామ్, అమ్మయ్య, ధర్మయ్య, నర్సింహచారి, రౌతు కమల్‌కుమార్ పాల్గొన్నారు.

వరంగల్‌లో భారతీమహాస్వామి విజయయాత్ర

హన్మకొండ కల్చరల్: బెంగళూరుకు చెందిన శృంగేరీ శివగంగ శారదా మఠాధీశ్వరులు పురుషోత్తమ భారతీమహాస్వామి విజయయాత్రలో భాగంగా ఈనెల 20, 21వ తేదీల్లో వరంగల్‌లో పర్యటించనున్నారు. శారదావిద్యారణ్య చారిటబుల్ ట్రస్ట్, జగద్గురువాద్య ఆదిశంకరాచార్య సమితి ట్రస్ట్, శంకర సేవా సమితి ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం వరంగల్‌లోని శృంగేరీమఠంలో చంద్రమౌళీశ్వర పూజలు, బుధవారం ఉదయం నుంచి భద్రకాళి దేవాలయం, వేయిస్తంభాల దేవాలయం, పద్మాక్షి దేవాలయాలను సందర్శించనున్నారు.

తహసీల్దార్‌పై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం..

కాజీపేట: మహబూబాబాద్ తహసీల్దార్‌పై గ్రామస్తులు దాడిచేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ గనిపాక రాజ్‌కుమార్ తెలిపారు. హనుమకొండ జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి రాజ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా కోర్టుకు కేటాయించిన స్థల పరిశీలన కోసం వెళ్లిన తహసీల్దార్ ఇమాన్యుయల్‌పై స్థానిక తండావాసులు దాడిచేయడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. దాడికి పాల్పడిన నిందితులపై వెంటనే కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా రెవెన్యూ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి సోమవారం నిరసన తెలపాలని కోరారు.

ద్విచక్రవాహనం చోరీ

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేట విశ్వనాథ కాలనీలో నిలిపి ఉంచిన ద్విచక్రవాహనం చోరీకి గురైంది. బాధితుడి కథనం ప్రకారం విశ్వనాథకాలనీకి చెందిన అలకుంట అనిల్ తన బైక్‌ను ఈనెల 11న అదేవీధిలో పార్క్ చేసి ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం చూసేసరికి బైక్ కనిపించలేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు.

బాధితులకు పరామర్శ

కాజీపేట: పలు కారణాలతో అనారోగ్యాల బారినపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న పలువురిని మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆదివారం పరామర్శించారు. భరత్, మహేందర్ రెడ్డి, జైపాల్ రెడ్డిని కలిసి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో చర్చించారు. మెరుగైన వైద్య చికిత్స అందించాలని డాక్టర్లకు సూచించారు.

గంటూరుపల్లిలో..

హసన్‌పర్తి: అనారోగ్య సమస్యలతో మృతిచెందిన హసన్‌పర్తికి మండలం గంటూరుపల్లికి రాజిరెడ్డి మృతదేహాన్ని బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, కాంగ్రెస్ నియోజకవర్గ కోఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్ ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మృతుడి కుమారుడు మాజీ సర్పంచ్ పోరెడ్డి కిషన్‌రెడ్డిని పరామర్శించారు.

సోనియా చొరవతోనే తెలంగాణ

వరంగల్: కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ చొరవతోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందన్న విషయం మరిచి మంత్రి కేటీఆర్ అహంకార పూరితంగా మాట్లాడడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రావొద్దని ఎంతోమంది అడ్డుపడినా ఇచ్చిన మాటకు కట్టుబడి రాష్ట్రం ఇచ్చారని పేర్కొన్నారు.

మహాసభలకు తరలిన ఎలక్ట్రీషియన్లు



బస్సుయాత్రను ప్రారంభిస్తున్న సిరిల్ లారెన్స్

కాజీపేట: ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ల 10వ మహాసభల బస్సుయాత్రను కాజీపేట ప్రధాన రహదారిపై సంఘం గౌరవ అధ్యక్షుడు సిరిల్ లారెన్స్ ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. హైదరాబాద్‌లో జరుగుతున్న మహాసభలకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి వందలాది మంది సభ్యులు తరలివెళ్లారు.

బస్సుయాత్రను జయప్రదం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న రంగయ్య

కరీమాబాద్: నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, అర్హులకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలనే డిమాండ్‌తో తెలంగాణ ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న బస్సుయాత్రను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు సీహెచ్.రంగయ్య పిలుపునిచ్చారు. ఉర్సుగుట్ట ఆర్‌ఎస్ భవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇల్లులేని నిరుపేదలకు ఇంటి నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. గుడిసెలు వేసుకున్న పేదలందరికీ జీఓ 58, 59 ప్రకారం పట్టాలివ్వాలని సూచించారు. ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఈనెల 12నుంచి 18వరకు కార్పొరేషన్ పరిధిలోని 23 డివిజన్లలో ప్రజల సమస్యలపై సర్వే నిర్వహించినట్లు వివరించారు. ఈనెల 21న నాయుడు పెట్రోల్ పంపు – ఆర్టీఏ జంక్షన్ వద్ద నిర్వహించనున్న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ముక్కెర రామస్వామి, సాగర్, అరుణ్‌కుమార్, సాంబమూర్తి, దుర్గయ్య, ఆవాజ్, యాకుబ్‌పాషా, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ ఫలితంగానే బీఐఎస్ హాల్‌మార్క్



సమావేశంలో మాట్లాడుతున్న సుదర్శన్

ఖిలా వరంగల్: సీసీఐ దీర్ఘకాల ఉద్యమ ఫలితంగానే బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) హాల్‌మార్క్‌ను కేంద్ర ప్రభుత్వ వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రవేశ పెట్టిందని కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు మొగిలిచెర్ల సుదర్శన్ అన్నారు. జూన్ 15నుంచి ప్రతి ఆభరణంపై హాల్‌మార్క్, హెచ్‌యూఐడీ నంబర్‌ను తప్పనిసరిగా ముద్రించాలని కేంద్రం ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. దీనిపై వినియోగదారులను చైతన్యం చేయాలని వినియోగదారుల ప్రతినిధులకు సూచించారు. ఈమేరకు వరంగల్ శివనగర్‌లోని జిల్లా వినియోగదారుల సమాఖ్య కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో సీసీఐ లీగల్ అడ్వైజర్ మెంబర్ రంగరాజు ఆనందరావు మాట్లాడుతూ వినియోగదారులు పరీక్షించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో సీసీఐ లీగల్ అడ్వైజర్ బండి అనిల్‌కుమార్, సలహాదారుడు డాక్టర్ వీరస్వామి, అల్లాది వీరభద్రయ్య, సీసీఐ ప్రతినిధులు పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి సీఎంఆర్‌ఎఫ్ భరోసా



ఎల్‌ఓసీ అందజేస్తున్న ఎమ్మెల్యే రమేష్



చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధర్మారెడ్డి

హసన్‌పర్తి: నిరుపేదల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలుస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. నగరంలోని రెండో డివిజన్ గుండ్లసింగారం గ్రామానికి చెందిన దద్దునూరి రాధ అనారోగ్యంతో బాధపడుతుండగా ఆమె వైద్య చికిత్సకు మంజూరైన రూ.2లక్షల ఎల్‌ఓసీని హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని తన స్వగృహంలో ఎమ్మెల్యే ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యశ్రీలో లేని వ్యాధులకు సీఎంఆర్‌ఎఫ్‌తో ఆదుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు నరెడ్ల శ్రీధర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గనిపాక విజయ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ఖిలా వరంగల్: వరంగల్ 17వ డివిజన్‌లోని వసంతాపూర్, ఆదర్శనగర్, స్తంభంపెల్లి, దూపకుంట, గాడిపెల్లి, బొల్లికుంట గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ఆదివారం పంపిణీ చేశారు. హనుమకొండలోని తన నివాసంలో చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ గద్దె బాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తుమ్మ సాగర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ సోల్తి భూమాత, నరేందర్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు తరగల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి మారపాక నాగరాజు, ఊరుగొండ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు తెరుచుకున్న ఎంఈఓ కార్యాలయం



తెరుచుకున్న ఎంఈఓ కార్యాలయం

సాక్షి స్పందన

కాజీపేట: కాజీపేట మండల కేంద్రంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన మండల విద్యా వనరుల కేంద్రం భవనం ఏడేళ్లుగా ప్రారంభోత్సవానికి నోచుకోకుండా వృథాగా ఉంటోందని ఇటీవల సాక్షి దినపత్రిలో వచ్చిన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. మండల విద్యాశాఖ అధికారులకు అందుబాటులో ఉండేలా నిర్మించిన భవనం నిరుపయోగంగా మారడంతో అలంకార ప్రాయంగా మారింది. సర్కార్ తుమ్మలు, పిచ్చి మొక్కలు పెరగడంతో పాటు జులాయిల జల్సాలకు అడ్డాగా మారింది. కాగా, మండల అధికారులు స్పందించి భవనం చుట్టూ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. మండల ఇన్‌చార్జ్ విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో పనులు సాగుతున్నాయి.

భిక్షాటనలో బాల్యం బందీ



భిక్షాటన చేస్తున్న చిన్నారి

కాజీపేట అర్బన్: పేదరికం కారణంగా అనేకమంది పిల్లలు భిక్షాటన చేస్తూ బంగారు జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారు. పట్టించుకోవాల్సిన బాలల పరిరక్షణ అధికారులు (ఐసీపీఎస్) నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. చాలామంది బడీడు పిల్లలు బడుల్లో కాకుండా భిక్షాటన, పనులు చేస్తూ దీనావస్థలో మగ్గుతున్నారు. నగరంలోని ఎంజీఎం, అదాలత్, సీపీఓ, సుబేదారి, కాజీపేట, ములుగు రోడ్డు, అశోకా జంక్షన్ల వద్ద రెడ్ సిగ్నల్ పడిన సమయంలో వాహనదారుల వద్దకు వెళ్లి చిన్నారులు భిక్షాటన చేస్తున్నారు. ప్రమాదమని తెలిసినా రద్దీగల రోడ్లపై యాచిస్తున్నారు. ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

క్రెడాయి కమిటీ ఎన్నిక



నయీంనగర్: క్రెడాయి (కన్‌ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా) నూతన కమిటీ ఎన్నిక హనుమకొండ కేయూ క్రాస్ క్రెడాయి కార్యాలయంలో ఆదివారం జరిగింది. అధ్యక్షుడిగా ఏ.తిరుపతి రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా జే.మనోహర్, కోశాధికారిగా ఏ.వెంకటమల్లారెడ్డి, వైస్ ప్రెసిడెంట్లుగా ఎస్.అమర్‌లింగేశ్వర్ రావు, ఎం.రవీందర్ రెడ్డి, ఎస్.అమరేందర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా వరుణ్ అగర్వాల్, జాయింట్ సెక్రటరీలుగా ఎల్.రజనీకాంత్ రెడ్డి, గాదె రాజేందర్ రెడ్డి, ఎం.రాజ్ కుమార్, ఈసీలుగా ఎండీ.సలీమొద్దీన్, వీ.రవీందర్, టీ.హర్షవర్ధన్, ఎస్.శ్రీనివాస్, పీ.శ్రీనాథ్‌రావు, ఏ.కొండారెడ్డి, పీ.చంద్రమోహన్ ఎన్నికయ్యారు.